

అమ్మవార్లకు ఆషాఢ సారె

భట్టిప్రోలు: వెల్లటూరు గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ పరివార దేవాలయంలో అమ్మవార్లకు శుక్రవారం ఆషాఢ సారె సమర్పించారు.



గౌరీదేవికి లక్ష కుంకుమార్చన

నగరంపాలెం: గుంటూరు బ్రాడీపేటలోని శ్రీగౌరీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శతాబ్ది మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్ష కుంకుమార్చన చేశారు.

శాకంబరిగా కాళీమాత



మంగళగిరి: రాజీవ్ గృహ కల్ప రోడ్డులో ఉన్న కాళీ మాత ఆలయంలో శుక్రవారం శాకంబరి ఉత్సవాలు నిర్వహించారు. అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

న్యూస్‌రీల్

నేడు నృసింహస్వామి ఆలయంలో సహస్ర దీపాలంకరణ



మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శనివారం రాత్రి సహస్ర దీపాలంకరణ నిర్వహించనున్నట్లు ఈవో సునీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ ఉత్సవానికి కైంకర్యపరులుగా గుంటూరుకు చెందిన కొప్పురావూరి లక్ష్మీశ్రీనివాసరావు దంపతులు వ్యవహరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

సమన్వయంతో ఫ్లై ఓవర్ పనులు

కలెక్టర్ నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్: గుంటూరు నగరంలోని శంకర్‌విలాస్ నూతన ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు సమన్వయంతో వేగంగా జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనులు ప్రారంభమైన నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు కోసం ప్రత్యామ్నాయ రహదారులు సిద్ధం చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మోటార్లు, జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలని, 24 గంటలూ సిబ్బంది విధుల్లో ఉండే విధంగా ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలించుకోవాలన్నారు. ఇప్పటికి ఆక్రమణలు తొలగించిన వాటిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు తదితర వ్యాపారులు సాయంత్రం వేళలో ఇళ్లకు వెళ్లే క్రమంలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా పోలీసులను ఏర్పాటు చేయాలన్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన స్థానిక పెద్దలతో, వ్యాపారస్తులతో నిరంతరం చర్చలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఎస్‌ఈ శ్రీనివాసమూర్తి, జీఎంసీ ఎస్‌ఈ శివనాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీపీఓ శేషశ్రీ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సర్వేలో గుంటూరుకు ప్రథమ స్థానం

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో నిర్వహించిన ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) పారిశుద్ధ్య సర్వేలో గుంటూరు నగరపాలక సంస్థ రాష్ట్రస్థాయిలో తొలి స్థానంలో నిలవడం అభినందనీయమని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐవీఆర్ఎస్ బృందం పారిశుద్ధ్య పనులకు సంబంధించి రాష్ట్రంలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో చేపట్టిన ప్రజాభిప్రాయ సర్వేలో గుంటూరు నగరపాలక సంస్థ 67 శాతంతో ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ప్రజారోగ్య కార్మికులు ప్రతి రోజూ ఇంటి నుండి చెత్త సేకరిస్తున్నారా, మీ ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్త కుప్పలను 24 గంటల్లోగా తొలగిస్తున్నారా, లేదా, మీ మునిసిపాలిటీలో డ్రైన్లను శుభ్రం చేస్తున్నారా లేదా అనే మూడు అంశాలపై ఐవీఆర్ఎస్ బృందం చేసిన సర్వేలో గుంటూరు నగర ప్రజలు తమ అభిప్రాయాలు తెలిపిన మేరకు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో గుంటూరు నగరపాలక సంస్థ ప్రథమ స్థానంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర స్థాయిలో గుంటూరు నగరానికి మంచి పేరు తెచ్చిన ప్రజారోగ్య కార్మికులు, అధికారులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామని పేర్కొన్నారు.

గురజాల తహసీల్దార్ సస్పెన్షన్

గురజాల: మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వైవీ కుటుంబ రావును సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కుటుంబ రావు గతంలో దాచేపల్లి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సమయంలో కేసానుపల్లి, పెదగార్లపాడు, భట్రుపాలెం, గామాలపాడు గ్రామాల్లో ప్రభుత్వ భూముల విషయంలో అక్రమాలకు పాల్పడినట్లు ఉన్నతాధికారులు దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జూన్ మాసంలో దాచేపల్లి మండలం నుంచి ఆయన గురజాలకు బదిలీపై వచ్చారు.

ల్యాబ్ ప్రారంభానికీ సాగుదీతే

వ్యయసాయాన్ని పండుగ చేయాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందడుగు వేసింది. కానీ నేటి కూటమి సర్కారు మాత్రం సాగు దండగే అనే తన వైఖరిని మరోమారు చాటుతోంది. వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యతను పరీక్షించడానికి, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడానికి సహాయం చేసేందుకు నియోజకవర్గానికి ఒక అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ నేడు పాలకులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది.

- నిరుపయోగంగా వ్యయసాయ పరీక్ష ల్యాబ్
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే సమస్యలు
- రూ.62.70 కోట్లతో ల్యాబ్ ఏర్పాటు
- వృథాగా పడి ఉన్న పలు పరికరాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

అద్దంకిలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్



అద్దంకి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2023లో రూ.62.70 కోట్లు దీనికి కేటాయించారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో భవనాన్ని నిర్మించారు. అయితే కాంట్రాక్టర్ కిటికీలకు అద్దాలు మాత్రమే పెట్టి, గ్రిల్స్ ఏర్పాటు చేయలేదు. ఈ క్రమంలో ల్యాబ్‌ను ప్రారంభించినా అభద్రతా భావంతో అధికారులు పరికరాలను అందులో ఉంచడంలేదు. ఫలితంగా ప్రయోగశాల వినియోగంలోకి రాలేదు. వెటర్నరీ ల్యాబ్ మాత్రం కొనసాగుతోంది.

ఉపయోగాలు ఎన్నో..



ఏడీఏ కార్యాలయం గదిలో ఉన్న పరికరాలు

ఈ ల్యాబ్ అందుబాటులోకి వస్తే రైతు సొంతంగా తయారు చేసుకున్న విత్తనం లేదా, కొనుగోలు చేసిన విత్తనాన్ని తీసుకెళ్లి ఉచితంగా మొలక శాతం పరీక్ష చేయించుకోవచ్చు. ఎరువుల నాణ్యత, విత్తన పరీక్ష నివేదికను వారం నుంచి పది రోజులలోపు పొందవచ్చు. ఎరువుల నాణ్యతను రెండు, మూడు రోజుల్లోనే తెలుసుకోవచ్చు. రైతులకు అన్ని పరీక్షలు పూర్తిగా ఉచితంగా లభిస్తాయి. ప్రతి ల్యాబ్ నమూనాల పరీక్ష కోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ క్వాలిటీ కంట్రోల్ యాప్ అభివృద్ధి చేశారు. ఫలితాలను ట్యాంపర్ చేయడానికి వీలు లేకుండా ఆటోమేషన్ ఏర్పాటు చేశారు. రైతు దుకాణానికి వెళ్లినపుడు పునఃపరిశీలించుకుంటే సరిపోతుంది. నాణ్యతా సర్టిఫికెట్ ఉందో లేదో తెలిసిపోతుంది. శాంపిల్ పరీక్ష జరిగిందో లేదో కూడా ట్రాక్ చేయవచ్చు. ఇన్ని ఉపయోగాలున్న ప్రయోగశాల అందుబాటులోకి తీసుకుని రావాలని నియోజకవర్గంలోని రైతులు కోరుతున్నారు.

గ్రిల్స్ పెడితే వినియోగంలోకి తెస్తాం

భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్ కిటికీలకు అద్దాలు మాత్రమే బిగించారు. గ్రిల్స్ ఏర్పాటు చేయలేదు. దాంతో అందులో విలువైన పరికరాలు ఉంచితే భద్రత ఉండదనే పరికరాలు బిగించలేదు. అదే విధంగా ఇక్కడ కేటాయించిన వ్యవసాయ అధికారి సెలవుల్లో ఉన్నారు. కెమికల్స్ కోసం ఇండెంట్ పెడుతున్నాం. గ్రిల్స్ ఏర్పాటు చేస్తే మరో నెలలో ల్యాబ్ అందుబాటులోకి తీసుకొస్తాం.

– ఎఫ్రాయిమ్, ఏడీఏ



గ్రిల్స్ లేని కిటికీలు

తిరగబడ్డ రైతుబిడ్డ

- రెండో విడత భూ సమీకరణపై వెనక్కి తగ్గిన కూటమి ప్రభుత్వం
- రాజధాని రైతుల వ్యతిరేకతతో కేబినేట్ నిర్ణయం వాయిదా

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రెండోవిడత భూసేకరణలో ప్రభుత్వానికి రైతుల నుంచి వ్యతిరేకత సెగ తగిలింది. సొంత సామాజిక వర్గానికి చెందిన రైతులే తిరగబడటంతో ఒక అడుగు వెనక్కి వేసింది. బుధవారం జరిగిన కేబినేట్ మీటింగ్‌లో దీనిపై నిర్ణయం తీసుకోకుండా వాయిదా వేసింది. రైతులతో చర్చించి వారిని ఒప్పించి నిర్ణయం తీసుకుంటామంటూ సన్నాయి నొక్కులు నొక్కడం మొదలు పెట్టింది.

పొంతన లేని లెక్కలు

ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు గ్రామాల్లో జరుగుతున్న తీరుకు సంబంధం లేకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పూలింగ్ పేరుతో అధికారులు గ్రామసభలు నిర్వహిస్తూ రైతులను భయభ్రాంతులకు గురి చేశారు. పైగా ప్రభుత్వం కూడా ఎక్కడ భూమి తీసుకుంటుందో.. ఏ గ్రామాల్లో ఎంత అవసరమో చెప్పకుండా ఏకంగా గెజిట్ విడుదల చేసింది. ముందు ప్రకటించిన గ్రామాల్లోనే కాకుండా తాడికొండ మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా గ్రామసభలు నిర్వహించడం వివాదానికి దారితీసింది. ప్రభుత్వం పైకి చెబుతున్నది ఒకటైతే.. పరోక్షంగా లక్ష ఎకరాలకు పైగా భూసమీకరణ చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

తలాతోక లేని అభిప్రాయ సేకరణ

తాడికొండ మండలంలోని మూడు గ్రామాల్లో 7,256 ఎకరాలు, తుళ్లూరు మండలంలోని మూడు గ్రామాల్లో 10,878, అమరావతి మండలంలోని ఎనిమిది గ్రామాల్లో 19,504, పెదకూరపాడు మండలంలోని రెండు గ్రామాల్లో 4,586 కలిపి 42,226 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించి గ్రామ సభలు నిర్వహించారు. నోటిఫికేషన్ కూడా వీటికి సంబంధించి విడుదల అయింది. అయితే గెజిట్‌తో సంబంధం లేకుండా అభిప్రాయ సేకరణ పేరుతో తాడికొండ మండలంలో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ సభలకు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సమీకరణకు భూములివ్వబోమని తెగేసి చెప్పారు. వినతిప్రతం కూడా అందజేశారు. భూ



భూములివ్వబోమని చెబుతున్న రైతులు

బాగోతంపై రైతులు బేజాత్పురం, రావెల గ్రామ సభల్లో ప్రశ్నించినప్పటికీ ఎమ్మెల్యే, ఆర్డీవోలు మాట దాటవేత ధోరణే తప్ప సమాధానం చెప్పలేదు. నోటిఫికేషన్‌కు ముందు జరిపిన గ్రామ సభలకు సంబంధం లేకుండా గత గురువారం తాడికొండ మండలంలోని పాములపాడు, బేజాత్పురం, రావెల గ్రామాల్లో, తర్వాత రోజు ఫణిదరం, దామరపల్లి, బండారుపల్లి గ్రామాల్లో సభలు నిర్వహించారు. తాడికొండ మండలం పొన్నెకల్లులో రైతులు ఏకంగా అడ్డం తిరిగారు. తాము భూములిచ్చేది లేదంటూ 'ఎమ్మెల్యే గో బ్యాక్' అంటూ నినాదాలు హోరెత్తించారు. దీంతో అధికారులు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మధ్యలోనే వెనుతిరిగారు.



గోబ్యాక్ అంటూ నినదిస్తున్న టీడీపీ నేతలు, రైతులు

సొంత సామాజిక వర్గం నుంచే వ్యతిరేకత

సొంత సామాజిక వర్గమే బాబుకు ఎదురు తిరగడంతో ప్రభుత్వంలో కలకలం రేగింది. ఇప్పటికే తీసుకున్న 33 వేల ఎకరాలను అభివృద్ధి చేసి మేలు చేస్తావనుకుంటే మరోసారి సమీకరణ పేరుతో నోళ్లు కొడతారా ? అంటూ గ్రామాల్లో రైతులు దుర్భాషలాడుతున్నారు. భూములు ఇచ్చేది లేదంటూ గ్రామాల్లో మైక్ ప్రచారం చేయడం సంచలనంగా మారింది. దీంతో ప్రభుత్వం వెనక్కు తగ్గింది.

రైతన్నల క'న్నీటి' తడులు...



కొల్లూరు సమీపంలో బీటలు వారిన వరి పొలం



మొసలిపాడు సమీపంలో విద్యుత్తు మోటారుకు ట్యూబ్ పరుస్తున్న రైతు

వాతావరణ పరిస్థితుల్లో విపరీతమైన మార్పుల ప్రభావం ఖరీఫ్ రైతాంగాన్ని కలవరపాటుకు గురిచేస్తోంది. ముందుగా వెద పద్ధతిలో సాగైన పంటకు నీరందక ఎండుపోతున్నాయి. అదనుకు కురవాల్సిన వర్షాలు పడకపోవడంతోపాటు ఎండలు మండుతూ, విపరీతమైన వేడి గాలులు వీస్తుండటంతో మొలక దశలో ఉన్న వెద పద్ధతిలోని వరి మొక్కలు దెబ్బతింటున్నాయి. బీటలు వారిన పొలాలకు డీజిల్ ఇంజిన్లు, విద్యుత్తు మోటార్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు, వేమూరు, భట్టిప్రోలు, అమృతలూరు, చుండూరు మండలాలలో విత్తనాల తరుణం కావడం, ఇటు వర్షాలు పడకపోవడం, సాగు నీటి కాలువల ద్వారా నీరు విడుదల కాక సమయం మించిపోతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – కొల్లూరు

ఓటరు క్లెయిమ్‌ల విచారణ వేగవంతం చేయండి



సూచనలు ఇస్తున్న ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు

చీరాల టౌన్: బీఎల్‌వోలు విధులను సమర్థవంతంగా నిర్వహించి ఓటరు క్లెయిమ్‌ల విచారణ వేగవంతం చేయాలని ఈఆర్‌వో, ఆర్డీఓ టి.చంద్రశేఖర నాయుడు సూచించారు. శుక్రవారం చీరాల మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో చీరాల నియోజకవర్గంలోని బీఎల్‌వోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓటరు అర్జీలు పెండింగ్‌లో లేకుండా పనిచేయాలన్నారు. నిశితంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలని పేర్కొన్నారు. అభ్యంతరాల వివరాలను తెలియజేయాలని కోరారు. మృతుల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. విచారణ ఈసీ నిబంధనల ప్రకారం చేయాలని కోరారు. సమస్యలుంటే తమకు తెలియజేయాలని సూచించారు. తహసీల్దార్ కె.గోపీకృష్ణ, ఎన్నికల డీటీ సుశీల, మున్సిపల్, వేటపాలెం మండలాల్లోని బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బాపట్లలో కుండపోత వర్షం



జలమయమైన బాపట్ల ఆర్టీసీ బస్టాండ్

బాపట్ల టౌన్ /బాపట్ల: బాపట్లలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి పట్టణం జలమయమైంది. బాపట్లలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. రోడ్లన్నీ కాలువలను తలపించాయి. ముఖ్యంగా పట్టణంలోని పాతబస్టాండ్, సంజయ్‌గాంధీ కాలనీ, విజయలక్ష్మీపురం, ఇస్లాంపేట, డ్రైవర్స్ కాలనీ, మల్లికార్జున బృందావనం కాలనీ, దర్శి పెద్ద మస్తాన్ నగర్ ప్రాంతాల్లో భారీగా నీరు చేరడంతో రహదారులు జలమయంగా మారాయి.

కొత్త కోర్సులు పిలుస్తున్నాయి.. బ్రో !

- ఇంజినీరింగ్ విద్యలో పలు నూతన కోర్సులు
- ఆసక్తి చూపుతున్న యువత
- చీరాల, బాపట్ల కళాశాలల్లో వేలాది సీట్లు
- డేటా సైన్స్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్, సీఎస్‌ఈ కోర్సుల వైపు మొగ్గు



వేటపాలెం: కష్టపడి ఇంజినీరింగ్ పూర్తి చేసినా యువకులకు కొలువులు దక్కడం లేదు. ఇంటి దగ్గరే ఉంటున్న పిల్లలను చూసి పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు పట్టణాలకు వెళ్లి చిన్నపాటి ఉద్యోగాలు చేస్తూ, చాలీచాలని జీతాలతో అవస్థలు పడుతున్నారు. దీంతో ఇటీవల సివిల్, మెకానికల్ కోర్సుల జోలికి వెళ్లడం విద్యార్థులు మానేశారు. సీఎస్‌ఈ, ఈసీ బ్రాంచ్‌లకు డిమాండ్ పెరిగింది. దీంతో 70 శాతం మంది ఈ రెండు బ్రాంచిలే ఎంపిక చేసుకుంటున్నారు. అయితే, కోర్సు పూర్తి చేసుకున్న తరువాత ఉద్యోగ అవకాశాలు అందరికీ అందడం లేదు. కేవలం 15 నుంచి 20 శాతం మందికే వస్తున్నాయి.


ప్రత్యామ్నాయాలు తప్పనిసరి

సీఎస్‌ఈ, ఈసీ బ్రాంచ్‌లకు దీటుగా నేడు మరి కొన్ని కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డెటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ వంటి ఎమర్జింగ్ ఏరియాలను కవర్ చేయగల నాలెడ్జ్ ఉన్న కోర్సులివి. రోబోటిక్ పరిజ్ఞానం ఉండటం ఈ కోర్సుల్లో ప్రధాన పాత్ర. వీటికి ప్రస్తుత మార్కెట్‌లో కూడా మంచి డిమాండ్ ఉంది.

మేజర్, మైనర్ కోర్సులు చేసే అవకాశం

జిల్లా వ్యాప్తంగా చీరాల, బాపట్లలో ఉన్న నాలుగు ఇంజినీరింగ్ కళాశాలల్లో 3,000 సీట్లు పైగా ఉన్నాయి. వీటిలో సీఎస్‌ఈ, ఈసీఈ, ఐటీ బ్రాంచుల్లో 2,200 సీట్లు ఉన్నాయి. మెకానికల్, ఈఈఈ, సివిల్ వంటి కోర్ బ్రాంచుల విద్యార్థులకు సైతం సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు ఉండటం విశేషం. ప్రభుత్వం ప్రకటించిన నూతన జాతీయ విద్యా విధానంతో ఒకే సమయంలో మేజర్, మైనర్ కోర్సులు చేసుకునే వెసులుబాటు ప్రస్తుతం ఉంది. మైనర్‌గా కోర్ కోర్సులు తీసుకున్నా మైనర్ కింద ఏఐ ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్సు చేయడానికి అవకాశం ఉంది. ఈసీఈలో చేరితే సెమీ కండక్టర్, చిప్ తయారీ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈఈఈ విద్యార్థులైతే ఈఎల్ఎస్, ఎంబెడ్ సిస్టం లాంటి కోర్సులు నేర్చుకోవడంతో మంచి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు. సివిల్ ఇంజినీరింగ్ వారు సాఫ్ట్‌వేర్ కోర్సులు నేర్చుకోవడానికి అవకాశం ఉంది.


కొత్త కోర్సులకు డిమాండ్



గతంలో ఇంజినీరింగ్ సీట్లు విద్యార్థులు చేరక ఖాళీగా ఉండేవి. సీఎస్‌ఈ, ఈసీ బ్రాంచీలు అందుబాటులోకి వచ్చిన తరువాత విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అయితే, వంద మందిలో 80 శాతం సీఎస్‌ఈ చదువుతుండటంతో అందరికీ ఉద్యోగాలు రావడం లేదు.

–వనమా రామకృష్ణారావు, సెక్రటరీ, సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల, చీరాల

కంప్యూటర్ కోర్సుల వైపు మొగ్గు



ఇంజినీరింగ్ విద్యలో అందుబాటులోకి వచ్చిన కొత్త కోర్సులకు డిమాండ్ పెరిగింది. సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ కోర్సులకు డిమాండ్ తగ్గిపోయింది. దీనికి బదులుగా కొత్తగా వచ్చిన ఆర్టిఫీషియల్ ఇంటిల్‌జెన్స్, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ వంటి కోర్సులకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. ఈ రోబోటిక్ కోర్సులకు దేశంలో కాకుండా విదేశాల్లో కూడా ఎక్కువ ఉద్యోగ అవకాశాలు రావడంతో విద్యార్థులు వీటిపై మొగ్గు చూపతున్నారు.

–ఎస్. లక్ష్మణరావు, కరస్పాండెంట్, సెయింట్ ఆన్స్ కాలేజీ, చీరాల

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,200 గరిష్ఠం : రూ. 2,000

మోడల్ ధర రూ. 1,600



పసుపు ధరలు

(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 834

కొమ్ములు : 509 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,500	10,281	10,050

కాయలు : 325 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,500	10,300	10,050

మొత్తం అమ్మకాలు : 625.500 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	35,320
అమ్మకాలు	39,226
నిల్వ	3,208

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,300
341	10,000-13,400

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,700
నంబరు-5	10,000-13,400
341	10,000-13,500
4884	10,000-12,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 13,500
బాడిగ-355	10,000 - 12,500
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,600 - 11,000
తాలుకాయలు	5,000 - 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,400
బాడిగ - 355	10,000-12,600
దేవనూరు డీలక్స్	10,000 - 12,500
తాలు	5,200 - 7,000

-కొరిటిపాడు (గుంటూరు)

రైతుల నుంచి మొత్తం పొగాకు కొనుగోలు చేయాలి

- రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు డిమాండ్
- పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన రైతు సంఘ నాయకులు



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు

లక్ష్మీపురం: జిల్లాలో రైతుల నుంచి మొత్తం నల్లబర్లీ పొగాకును గిట్టుబాటు ధరకు కొనగోలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు డిమాండ్ చేశారు. నాణ్యత లేదనే పేరుతో తిప్పి పంపడం సరికాదని తెలిపారు. గుంటూరు చుట్టగుంట సెంటర్‌లోని మార్కెట్ యార్డులో శుక్రవారం పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఫిరంగిపురం మండలంలోని తక్కెళ్లపాడు, కండ్రిక, మేరికపూడి గ్రామాల రైతులతో మాట్లాడారు. నల్లబర్లీ పొగాకులో తేమ శాతం ఎక్కువగా, నాసిరకంగా ఉందనే సాకుతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సీ గ్రేడ్ కింద 80 శాతం మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, క్వింటాకు ఆరు వేల రూపాయలు మాత్రమే దక్కుతుందని తెలిపారు. కండ్రిక గ్రామానికి చెందిన కాంతారావు అనే రైతు 16 చెక్కులు తీసుకు రాగా, నాసిరకంగా ఉందని 10 తిప్పి పంపేశారని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన మరో రైతు రామయ్య నాలుగు చెక్కులు కొనగోలు కేంద్రానికి తీసుకురాగా రెండు తిప్పి పంపారని చెప్పారు. ఫిరంగిపురం మండలం మేరిక పూడి గ్రామానికి చెందిన రైతు ముక్కంటి 55 చెక్కులు తీసుకు రాగా మొత్తం తెచ్చిన ట్రాక్టర్‌లోనే అధికారులు వెనక్కి పంపారని వివరించారు. ఈ స్థితిలో రైతాంగానికి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అధిక వడ్డీలకు అప్పు చేసి పంట పండిస్తే కొనగోలు కేంద్రాల్లో తక్కువ ధర వేయడం, తిప్పి పంపడం సరికాదని పేర్కొన్నారు. తెచ్చిన పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం 30వేల టన్నులు ఉత్పత్తి కాగా ఇప్పటికి నాలుగు వేల టన్నులు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. ఈ స్థితిని గమనించి ప్రైవేటు కంపెనీలు గ్రామాలలోనే తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నాయని చెప్పారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కొనుగోలు వేగం పెంచాలని, లేనిపక్షంలో ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వై.కృష్ణ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి వై.ఎస్.రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ కార్యదర్శి వైఎస్ రావు

బాపట్ల టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఎంప్లాయిస్ యూనియన్ లక్ష్యమని ఆ యూనియన్ కార్యదర్శి వైఎస్ రావు తెలిపారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ ఆవరణంలో శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. వైఎస్ రావు మాట్లాడుతూ 74 సంవత్సరాలుగా ఎంప్లాయిస్ యూనియన్ ఆర్టీసీ కార్మికుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందించడంతోపాటు వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉందన్నారు. ఉద్యోగులకు కావాల్సిన సౌకర్యాలు, వారికి రావలసిన రాయితీలు, ఉద్యోగులకు అందించే ప్రయోజనాల కోసం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. బాపట్ల డిపో కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ క్యాజువల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయించడంలో, సమాన పనికి సమాన వేతనం, యూనిఫామ్ ఇప్పించడం, వైద్య సౌకర్యాలు అందించడంలో ఎంప్లాయిస్ యూనియన్ చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో బాపట్ల డిపో అధ్యక్షులు టి.చంద్రశేఖర్, టి.యస్.నారాయణ, ఎం.కోటేశ్వర రావు గ్యారేజ్ సెక్రటరీ చలపతి, సి.సి.ఎస్. డెలిగేట్ ఎం.పి.కుమార్, సీనియర్ సభ్యుడు ఐ.యస్.రావు, బాపట్ల జిల్లా ఏపీ జేఏసీ అమరావతి మహిళా చైర్ పర్సన్ పి.రజిని పాల్గొన్నారు.

20న స్వర్ణలో ఏపీ కౌలు రైతు సంఘం ప్రథమ మహాసభ

బాపట్ల: కారంచేడు మండలం స్వర్ణలో ఈ నెల 20న ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రథమ మహాసభ నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు పి.కొండయ్య చెప్పారు. శుక్రవారం బాపట్లలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కొండయ్య మాట్లాడారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, ఏ పంటకు గిట్టుబాటు ధరలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పొగాకు రైతుల వెతలు మరీ వర్ణనాతీతంగా ఉన్నాయని తెలిపారు. ప్రధానంగా కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులు కౌలు రేట్లు పెంచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం కౌలు రైతుకు ఇచ్చే రాయితీలు అందడం లేదని అన్నారు.

ఈ సమస్యలపై సభలో చర్చించనున్నట్లు తెలిపారు. సభలకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సిహెచ్.గంగయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి. రామారావు హాజరవుతారని తెలిపారు. కౌలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



సంతమాగులూరు(అద్దంకి): సంతమాగులూరు(అద్దంకి): మండలంలోని మక్కెనవారి పాలెం గ్రామానికి చెందిన ఊదరగుడి సురేష్ కనిపించడం లేదని అతని తండ్రి మస్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పట్టాభిరామయ్య శుక్రవారం తెలిపారు. సురేష్ ఈ నెల 8వ తేదీ ఉదయం బాపట్ల దగ్గరలో ఉన్న నరసాయపాలెం గ్రామంలో అతని బంధువు చనిపోవడం వలన అక్కడికి వెళ్లి తిరిగి అదే రోజు సాయంత్రం 8 గంటలకు మార్టూరు వచ్చాడు. అక్కడ నుంచి ఇంటికి వస్తున్నానని భార్య నాగవేణికి ఫోన్ చేసి చెప్పాడు. అయితే తర్వాత ఎంతకీ రాకపోవడతో భార్య ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ కావడంతో ఆందోళన చెందారు. ఎత్తు 5 అడుగుల 5 అంగుళాలు, ఎరుపు రంగుతో ఉంటాడని, బయటకు వెళ్లేటప్పుడు మెరూన్ రంగు నిండు చేతుల చొక్కా, తెలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. సదరు వ్యక్తి గురించి తెలిసిన వారు సంతమాగులూరు ఎస్ఐ 9121102168 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మాదిగ లాయర్స్ ఫెడరేషన్ అధికార ప్రతినిధిగా సంగీతరావు



సత్తెనపల్లి: మాదిగ లాయర్స్ ఫెడరేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధికార ప్రతినిధిగా బొక్కా సంగీత రావు ఎన్నుకున్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఎల్ఎఫ్ రాష్ట్ర ఇన్‌చార్జి, సీనియర్ న్యాయవాది పూసులూరి జీవా అధ్యక్షతన గుంటూరులో జరిగిన సమావేశంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన న్యాయవాది బొక్కా సంగీతరావుని ఉమ్మడి గుంటూరు (గుంటూరు, బాపట్ల, పల్నాడు) జిల్లా అధికార ప్రతినిధిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సంగీతరావు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో న్యాయవాదుల సమస్యలు పరిష్కారం దిశగా పనిచేస్తానన్నారు. మాదిగల 30 ఏళ్ల చిరకాల కోరిక ఎస్సీ వర్గీకరణ కూటమి ప్రభుత్వంలో నెరవేరడం మాదిగ జాతి ప్రజల అదృష్టమన్నారు. అందుకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లకు ధన్యవాదాలు తెలిపారు.

మధ్యాహ్నభోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు



నకరికల్లు: విద్యార్థులకు వడ్డించే భోజనంలో నాణ్యత లోపిస్తే కఠినచర్యలు తీసుకుంటామని డెప్యూటీ డీఈఓ ఏసుబాబు హెచ్చరించారు. నకరికల్లులోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగోలేదని గురువారం తల్లిదండ్రులు ఆందోళన చేసిన నేపథ్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం రుచి చూశారు. నాణ్యతను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ముందుగా బియ్యం, కూరగాయలు నాణ్యతను పరిశీలించుకున్నాక వండాలని సూచించారు. వంట గదులు పరిశుభ్రంగా ఉండాలన్నారు. మరోసారి నాణ్యత లోపించినా, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వచ్చినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ కె.పుల్లారావు, జాలాది శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి



లారీ క్యాబిన్‌లో వీరభద్రరావు మృతదేహం

నాదెండ్ల: ఓ యంత్ర పరికరాన్ని దిగుమతి చేసేందుకు వచ్చిన లారీ డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎన్టీఆర్ జిల్లా చిరువూరు మండలం, వావిలాల గ్రామానికి చెందిన దంతాల వీరభద్రరావు (67) చిలకలూరిపేటలో లారీ ట్రాలర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం నరసరావుపేటలో ఓ యంత్ర పరికరాన్ని లోడ్ చేసుకుని గణపవరం గ్రామానికి వచ్చాడు. శుక్రవారం ఉదయం కూలీలు రాకపోయేసరికి 10 గంటలకు ట్రాలర్ యజమానికి ఫోన్ చేసి తనకు ఆరోగ్యం బాగా లేదని చెప్పాడు. సమీపంలోని దుకాణంలో గ్యాస్ తగ్గడానికి పౌడర్ ప్యాకెట్ తీసుకుని నీటిలో కలిపి తాగాడు. లారీలో విశ్రాంతి తీసుకున్నాడు. 11.30 గంటల సమయంలో ట్రైలర్ యజమాని ఫోన్ చేయగా వీరభద్రరావు ఫోన్ స్విచాఫ్‌లో ఉంది. దీంతో యజమాని అక్కడకు చేరుకుని చూడగా, వీరభద్రరావు లారీలో మృతి చెంది కనిపించాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసి నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై జి.పుల్లారావు మృతుడి కుమారుడితో ఫోన్‌లో మాట్లాడారు. మృతదేహాన్ని స్వగ్రామానికి పంపారు. గుండెపోటు కారణంగా వీరభద్రరావు చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

బావమరిది దాడిలో బావ మృతి



కృష్ణబాబు మృతదేహం

చేబ్రోలు: అక్కాబావల మధ్య జరుగుతున్న వివాద విషయం తెలుసుకున్న బావమరిది అక్కడకు వెళ్లి బావతో గొడవ పడి క్షణికావేశంలో కర్రతో తలపై దాడి చేసి గాయపరచటంతో మరణించిన సంఘటన చేబ్రోలు మండలం గుండవరం గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండవరం గ్రామానికి చెందిన నన్నపనేని కృష్ణబాబు (35)కు అదే గ్రామానికి చెందిన మక్కే భువనేశ్వరితో 12 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. వారం రోజుల నుంచి భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా గొడవ పడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో కృష్ణబాబు, భువనేశ్వరిల మధ్య వివాదం జరుగుతుండటంతో భువనేశ్వరి తమ్ముడు గోపీకి ఫోన్ చేసి గొడవ జరుగుతున్న విషయాన్ని తెలియజేసింది. గోపి అక్కాబావల ఇంటికి వచ్చి గొడవ విషయం గురించి మాట్లాడుతుండగా బావ బావమరిదిల మధ్య మాటమాట పెరిగింది. క్షణికావేశంలో గోపి బావను సమీపంలో ఉన్న పెద్ద కర్రతో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలై పడిపోయాడు. బంధువులు తీవ్ర గాయాలైన కృష్ణబాబును వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరీక్షించి అప్పటికే మరణించినట్లు తెలిపారు. మృతుని తల్లి నన్నపనేని వీరకుమారి ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్ఐ డి వెంకటకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సహోద్యోగి కుటుంబానికి అండగా కానిస్టేబుళ్లు

రూ.1.58 లక్షలు సమకూర్చిన మిత్రులు



రమేష్ అమ్మమ్మకు నగదును అందిస్తున్న డీఎస్పీ మోయిన్, కానిస్టేబుళ్లు

చీరాల: సహోద్యోగి అకాల మరణంతో కుటుంబాన్ని ఆదుకునేందుకు తామున్నామంటూ కానిస్టేబుళ్లు ముందుకు వచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన 2009 బ్యాచ్ కానిస్టేబుల్ బిల్లా రమేష్ ఇటీవల అకాల మరణం చెందారు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు తోటి పోలీస్ సిబ్బంది అందరూ కలిసి రూ.1.58 లక్షలను సమకూర్చారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ మోయిన్ శుక్రవారం వేటపాలెంలోని బిల్లా రమేష్ ఇంటికి వెళ్లి వృద్ధాప్యంలో ఉన్న అతని అమ్మమ్మకు నగదును అందించారు. డీఎస్పీ మాట్లాడుతూ రమేష్ చిన్న తనంలోనే తల్లిని కోల్పోయాడని, అమ్మమ్మ దాసరి సుబ్బులు అన్ని బాధ్యతలు తీసుకుని పెంచి పోషించిందని తెలిపారు. రమేష్ అకాల మరణంతో కష్టకాలంలో 2009 కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన అతడి మిత్రులు నగదును సమకూర్చారని చెప్పారు. ఇది ఇతర ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

అనుగురాజు కాంస్య విగ్రహానికి రూపకల్పన

- పిడుగురాళ్లలో ప్రతిష్ట నిమిత్తం రూపొందించిన తెనాలి శిల్పులు
- 12వ శతాబ్దంలో పల్నాడును పాలించిన అనుగురాజు
- 700 కిలోల కంచుతో తొమ్మిది అడుగుల నిలువెత్తు విగ్రహం



అనుగురాజు కాంస్య విగ్రహంతో శిల్పులు, విగ్రహ కమిటీ సభ్యులు

తెనాలి: పన్నెండో శతాబ్దంలో పల్నాడును పరిపాలించిన అనుగురాజు విగ్రహాన్ని తెనాలికి చెందిన ప్రముఖ శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్రలు రూపొందించారు. ఆయన చరిత్రకు సంబంధించిన ఫొటోలు అందుబాటులో లేకపోవడంతో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, విగ్రహ కమిటీ సూచనతో శిల్పకారులు పలు డ్రాయింగులు, కంప్యూటర్ డిజైన్లను తయారుచేశారు. ఆ ప్రకారం తొమ్మిది అడుగుల నమూనాను తయారుచేసి కమిటీ సంతృప్తిని వ్యక్తంచేశాక 700 కిలోల కాంస్యాన్ని వినియోగించి అనుగురాజు విగ్రహాన్ని సిద్ధం చేశారు. చారిత్రక ఆధారాల ప్రకారం అనుగురాజు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్పూర్ ప్రాంతం నుంచి వచ్చి పల్నాడును పరిపాలించారు. ఆయన శరీరాకృతి, వస్త్రధారణను ఊహించి విగ్రహాన్ని రూపొందించామని శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర చెప్పారు. ఈ విగ్రహాన్ని పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్లలో గంగమ్మతల్లి గుడి ఎదురుగా ప్రతిష్ఠించనున్నారు. విగ్రహ కమిటీ సభ్యులు, అనుగురాజు యాదవ్ అభిమానులతో గురువారం ఆ విగ్రహాన్ని పల్నాడుకు తీసుకువెళ్లారు.

అస్మదీయుడికి నామినేటెడ్ పదవి



చెరువు స్థలంలో నిర్మించిన భవనం



సెంటరులో చికెన్ స్టాల్

- వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా నియామకం
- గ్రామస్తుల నుంచి విమర్శలు

వేమూరు: కూటమి ప్రభుత్వంలో భూ కబ్జాదారులకు నామినేటెడ్ పదవులు లభించడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేమూరు నియోజకవర్గం జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్‌కు వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా పదవి కట్టబెడ్డటంపై పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. చావలి గ్రామానికి చెందిన ఆయన మెయిన్ సెంటరులో ప్రభుత్వం భూమి కబ్జా చేసినట్లు గ్రామస్తులు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అందులో ఏర్పాటు చేసిన చికెన్ స్టాల్ తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసినా రాజేష్ పట్టించుకోలేదు. చికెన్ స్టాల్ తొలగించకుండా ప్రభుత్వ అధికారులు, గ్రామస్తులపై కోర్టుకు వెళ్లాడు. ఇది కాకుండా గ్రామంలోని చెరువు స్థలం కూడా ఆక్రమించుకుని, రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీన్ని కొల్లూరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తప్పుడు సర్వే నంబర్ వేసి భార్యపై రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలుస్తోంది. పైగా భవనంపై ప్రైవేటు ఫైనాన్స్ నుంచి రుణాన్ని కూడా తీసుకున్నట్లు గ్రామంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. భూ కబ్జాలతో పాటు రాజేష్ ఏప్రిల్ 24న దళిత యువకుడిపై చెప్పుతో దాడి చేశాడు. దీనిపై ఎస్సీ ఎట్రాసిటీ కేసు కూడా నమోదైంది. ఇటువంటి వ్యక్తికి కూటమి ప్రభుత్వం నామినేటివ్ పదవి ఇవ్వడంపై గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. జనసేన పార్టీకి నష్టం జరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. పైకి జనసేన నేతలు సిద్ధాంతాలు చెబుతూ, లోపల భూకబ్జాదారులకు పదవులు ఇస్తోందని విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం కళ్లు తెరవాలని, పార్టీ కోసం పని చేసిన వ్యక్తులను గుర్తించి పదవులు ఇవ్వాలని, ప్రభుత్వ ఆస్తులు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆది ఆంధ్ర కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడుగా గుండాల ఎన్నిక



డేవిడ్‌రాజుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి లలితకుమారి

బాపట్ల: దగ్గుమల్లివారిపాలెంలోని ఆది ఆంధ్ర కో-ఆపరేటివ్ ఫార్మింగ్ సొసైటీ అధ్యక్షుడిగా గుండాల విజయ్ డేవిడ్‌రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని ఏవీవీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎన్నికల అధికారి లలిత కుమారి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఆది ఆంధ్ర కోఆపరేటివ్ సొసైటీలో మొత్తం 177 మంది సభ్యులు ఉండగా ఎన్నికల్లో 158 మంది సభ్యులు పాల్గొన్నారు. అంతా ఆమోదం తెలపడంతో అధ్యక్షుడిగా గుండాల విజయ్ డేవిడ్‌రాజు, ఉపాధ్యక్షుడిగా బి.వెంకటస్వామి, డైరెక్టర్లుగా బిల్లా ఎడ్విన్ రాజు, సలగల ఏసమ్మ, కూచిపూడి పరిశుద్ధం, మేకల సత్యానందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి ఎన్నికను ఎన్నికల అధికారి లలితకుమారి అధికారికంగా ప్రకటించారు. అధ్యక్షుడు గుండాల విజయ డేవిడ్‌రాజు మాట్లాడుతూ ఆది ఆంధ్ర సొసైటీ ఎన్నికల్లో వరుసగా నాలుగో సారీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎన్నికల అధికారి లలితకుమారి అధ్యక్షుడికి నియామక పత్రాన్ని అందించారు.

హాస్టళ్లలో వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం

ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సూర్యప్రకాశ్



మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

రేపల్లె: హాస్టళ్లలో విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమవుతోందని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎం.సూర్యప్రకాశ్ విమర్శించారు. పట్టణంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల వసతి గృహాన్ని శుక్రవారం ఎస్ఎఫ్ఐ బృందం పరిశీలించింది. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుంది. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ హాస్టల్‌లో పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 618 మంది విద్యార్థినులు ఉన్న గురుకులంలో ఆర్వో ప్లాంట్ పనిచేయక తాగునీటి కోసం అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. మోటర్ పనిచేయక పోవడంతో స్నానాలు, ఇతర అవసరాలకు కింద నుంచి మూడవ అంతస్తు వరకు నీటిని మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఉందని వివరించారు. ఫిబ్రవరిలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయులు వసతి గృహాన్ని సందర్శించిన సమయంలో ఆయా సమస్యలను విద్యార్థినులు ఆయనకు వివరించారని గుర్తు చేశారు. వారం రోజుల్లో ఆర్వో ప్లాంట్ బాగు చేయిస్తామని, నిధులు వెంటనే కేటాయిస్తున్నట్లు మంత్రి ప్రకటించి నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడం సిగ్గుచేటని ఖండించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కేవీ లక్ష్మణరావు, బాలికల విభాగం కన్వీనర్ కె.భవాని, పి.నిఖిత, వై.నవీన్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలి రూరల్: తెనాలి వన్ టౌన్ కానిస్టేబుల్ కన్నా చిరంజీవిపై దాడి చేసిన కేసులో ప్రధాన నిందితుడు వేమ నవీన్‌ని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఏప్రిల్ 24వ తేదీన చిరంజీవిపై వేము నవీన్ అలియాస్ కిల్లర్, చేబ్రోలు జాన్ విక్టర్, దోమ రాకేష్, బాబులాల్ దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇన్నాళ్లు తప్పించుకు తిరుగుతున్న నవీన్‌ను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.